www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 1 డిసెంబర్ 2025

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 1వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 1వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ సెల్..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 1వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 1వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ కోరారు.

కుప్పంలో పిజిఆర్ఎస్

కుప్పం: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 1వ తేదీని పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో తెలియజేస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

శాస్త్రీయ విద్య కోసం పోరాటం

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో రాష్ట్ర నాయకులు నరసింహా

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చదువుతూ పోరాడు.. చదువుపై పోరాడు.. నినాదంతో నిరంతరం విద్యాసంస్థలపై శాస్త్రీయ విద్యకోసం పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ఆదివారం చిత్తూరులోని ఉపాధ్యాయ భవన్‌లో జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరసింహ, మాజీ నాయకులు వాడ గంగరాజు హాజరై మాట్లాడారు. 1970లో అధ్యయనం పోరాటం అనే నినాదంతో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తూ, విద్యార్థుల మన్ననలు పొందిన ఏకైక విద్యార్థి సంఘం అన్నారు. గతంలో చిత్తూరులో గవర్నమెంట్ ఐటితోపాటు పివికేఎన్ పిసిఆర్ కన్నన్ కళాశాలలో అనేక మౌలిక వసతుల పరిష్కారం కోసం పోరాటం చేసి విద్యార్థులకు అండగాని నిలబడిందని అన్నారు. సంక్షేమ హాస్టల్లో ఉచితంగా ట్యూషన్ చెప్పించి విద్యార్థులకు మెరుగైన ఫలితాలు తీసుకొచ్చిన సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. ఇలాంటి విద్యార్థి సంఘాన్ని చిత్తూరు జిల్లాలో బలోపేతం చేయడం వల్ల విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడానికి సులభతరం అవుతుందని, ఈనెల 12 నుండి జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకుడు మసూద్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కేంద్రంలోని విద్యాసంస్థల్లో విద్యార్థులు రకరకాల ఇబ్బందులు పడుతూ చదువులు కొనసాగిస్తున్నారని, వాటి పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ మధ్యకాలంలో సీతం కాలేజీలో జరిగిన వరుస ఆత్మహత్యలపైన అపోలో మెడికల్ కాలేజీలో విద్యార్థుల అఘాత్యాలపైన, సంక్షేమ హాస్టల్ సమస్యల పైన పోరాటాలు చేయడం జరిగిందని గుర్తుచేశారు. ఇవే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామని తెలిపారు. చిత్తూరు కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని, సంక్షేమ హాస్టల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని, బకాయి ఉన్న ఫీజు రీయంబర్స్ కోసం పోరాటాలు చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా మసూద్, కో కన్వీనర్ దీపక్, కమిటీ సభ్యులుగా సాయి రోహిత్, సాయి కుమార్, నిశర్, హరి, కుమార్‌లను ఎన్నుకోవడం జరిగింది.

ఏనుగును కాపాడిన కుంకీలు

- బురదలో చిక్కుకున్న ఒంటరి ఏనుగు
- ఒడ్డుకు లాగిన కుంకీలు
- చికిత్స కోసం తిరుపతి జూ కు తరలింపు

ప్రజాశక్తి- యాదమరి



ఒడ్డుకు చేరిన ఒంటరి ఏనుగు

డీకే చెరువు అటవీ సరిహద్దు రిజర్వ్ ఫారెస్ట్‌లో గత కొన్ని నెలలుగా ఒంటరి ఏనుగు తిరుగుతోంది. ఏనుగు దాహం తీర్చుకునేందుకు అటవీ సరిహద్దు ప్రాంతమైన డీకే చెరువు సమీపంలోని గుడ్డోడి చెరువు వద్ద నీరు తాగేందుకు చెరువులోకి దిగి నీరు తాగి దాహం తీర్చుకుంది. చెరువు నుండి బయట వచ్చేందుకు ఏనుగు ప్రయత్నించగా చెరువులో బురద అధికంగా ఉండడంతో బయట రాలేక అక్కడే ఏనుగు ఘీంకారులు చేస్తూ ఇరుక్కుపోయింది. ఏనుగు అరుస్తున్న శబ్దం రావడంతో సమీపంలోని గ్రామస్తులు, చెరువు వద్దకు వెళ్లి చూశారు. ఏనుగు బూడిదలో చిక్కుక్కుపోవడాన్ని గమనించి ఫారెస్ట్ అధికారులకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న యాదమరి పోలీసులు, చిత్తూరు అటవీశాఖ అధికారులు, వెంటనే చెరువు వద్దకు చేరుకొని ఏనుగును చెరువులో నుంచి ఒడ్డుకు తీసేందుకు జెసిబిల సాయంతో ఎంత ప్రయత్నించినా ఏనుగును చెరువు నుండి ఒడ్డుకు తీసుకురాలేకపోయారు. దీంతో అటవీ శాఖ అధికారులు పలమనేరులోని కుంకీ ఏనుగులను డీకే చెరువు వద్దకు తెప్పించారు. రెండు కుంకీ ఏనుగుల సాయంతో బురదలో చిక్కుకున్న ఏనుగును మూడు గంటలపాటు శ్రమించి అటవీశాఖ అధికారులు, పోలీసులు, రెస్క్యూ టీమ్ ఒడ్డుకు చేర్చారు. ఏనుగు కాలికి గాయం కావడంతో ఫారెస్ట్ అధికారులు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర జూ వైద్యాధికారులకు సమాచారం అందించడంతో వైద్యాధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఏనుగు ఆరోగ్య పరిస్థితి అంచనా వేసేందుకు ఏనుగు ఎంతసేపటి నుండి నీటిలో ఉందని రూరల్ గ్రామస్తులు అడిగి తెలుసుకున్నారు. ఏనుగు కాలికి గాయం అవడంతో మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తిరుపతి జూకు తరలించినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఏనుగును సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు యాదమరి సబ్ఇన్స్పెక్టర్ ఈశ్వర్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని అటవీ శాఖ, పోలీసులతోపాటు గ్రామస్తులను వెంటనే అప్రమత్తం చేసి ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామస్తులు అటవీశాఖ, పోలీసులకు, రెస్క్యూ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఏనుగును ఒడ్డుకు లాగుతున్న కుంకీ ఏనుగులు

జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల

అసోసియేషన్ కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు మామిడికాయల మండిలోని వ్యవసాయ మార్కెట్ శాఖ ఏడీ కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని 10 వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతనంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ల అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్ జిఎం.రాజు– కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ, వైస్‌చైర్మన్ రాజన్న– పలమనేరు మార్కెట్ కమిటీ, శ్రీనివాసులు– సోమల మార్కెట్ కమిటీ ప్రధాన కార్యదర్శి సమీపతి – పుంగనూరు మార్కెట్ కమిటీ, సభ్యులుగా ఝాన్సీ వెంకటేష్ యాదవ్, భాస్కర నాయుడు, బంగారుపాళ్యం కృష్ణమ నాయుడు, రాజమ్మ, సుజాతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ రాజు మాట్లాడుతూ దళారీ వ్యవస్థను నిర్మూలించి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వారికి అండగా ఉంటూ మార్కెట్లలో రైతులకు వసతుల సౌకర్యం మెరుగుపరిచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని అన్నారు. రైతులకు, వ్యాపారులకు వారధిగా ఉంటూ లాభసాటి మార్కెటింగ్ చేయుటకు కృషి చేయాలని తెలిపారు.

పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నెల్లూరు జిల్లాలో ప్రజాకళాకారులు, యువజన నాయకుడు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి గుండాలను అరెస్టు చేయాలని ఆదివారం చిత్తూరులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరసింహ, సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయిని నిర్మూలిస్తున్నామని ప్రభుత్వ లక్ష్యమని నిరంతరం ప్రచారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో చూసిన గంజాయి విస్తృతంగా దొరుకుతున్నదని చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దవాళ్ల వరకు అందరిని మత్తులో ముంచుతున్నదని ఆరోపిచారు. గంజాయిపై ప్రజలను చైతన్యవంతులు చేస్తూ గంజాయికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజా నాట్యమండలి కళాకారుడు, యువజన సంఘం లీడర్ పెంచలయ్యను అత్యంత దారుణంగా చంపడం దుర్మార్గమన్నారు. హత్య చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో కూడా యువత గంజాయికి బానిసలవుతున్నారని, పోలీసులు తరచూ తనిఖీ నిర్వహిస్తూ గంజాయిని నియంత్రించాలని కోరారు. నేడు నెల్లూరు జరిగే బంద్‌కు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు.

పలమనేరు: గంజాయి ముఠా చేత హత్యకు గురైన పెంచలయ్యకు ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద నాయకులు నివాళి అర్పించారు. హత్యకు గురైన పెంచలయ్య, ప్రజానాట్య మండలి ద్వారా గంజాయి మానాలని, నివారించాలని, గంజాయి వలన యువత భవిష్యత్తును కోల్పోతున్నారని వారిలో చైతన్య కల్పిస్తున్నారని కక్షగట్టిన గంజాయి ముఠా పథకం ప్రకారం పెంచలయ్యను హత్య చేశారని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా, రాజా, జయంతి, అంజి, ధనమ్మ పాల్గొన్నారు.

పలమనేరులో..

ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉండాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాన్ వాయుగుండం ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం సమయంలోజిల్లా కలెక్టర్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిత్వా తుఫాన్ సందర్భంగా చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లుపై మండలాల వారీగా, శాఖల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు రాత్రి, రేపటి రోజు జిల్లాలో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, గ్రామ సచివాలయం సిబ్బంది అందరూ ప్రధాన కేంద్రాలలో ఉండాలన్నారు. జిల్లాలో 14 మండలాల్లో 168 గ్రామాల్లో దిత్వా తుపాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ముందస్తుగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్తు, ఆర్అండ్ బీ, వ్యవసాయ, పశుసం వర్ధక, పంచాయతీ రాజ్, మున్సిపల్, శాఖలతో పాటు అన్ని లైన్‌డిపార్ట్మెంట్లు అప్రమత్తంగా ఉంటూ.. తగు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాలు కురిసేటప్పుడు అత్యవసరమైతేనే ప్రజలు బయటికి రావాలని, నదులు, వంకలు పరివాహ ప్రాంతాలు, అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, ప్రజలకు సూచించారు.

ఎన్టీఆర్ జలాశయం, కృష్ణంరాజు జలాశయం నీటి విడుదలపై ఎస్సీ ఇంజనీర్లతో ఆరా తీశారు, జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో 14 మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిరంతరం 24/7 వైద్య సిబ్బంది ఉండేవిధంగా షిఫ్ట్ వారిగా విధులు ఉండాలని తెలిపారు. 237 గ్రామ. వార్డు సచివాలయ సిబ్బంది ప్రధాన కేంద్రంలో అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. పలమనేరు, పెద్దపంజాణి, బంగారుపాల్యం, నింద్ర, కార్వేటినగర మండలాలలో ప్రధాన చెరువుల వద్ద ఎస్సీ ఇరిగేషన్ ఆధ్వర్యంలో సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మండల పరిధిలోని అన్నీ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా అన్నీ చెరువుల వద్ద క్షేత్రస్థాయి సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వరి కోత సీజన్ ప్రారంభం అయినందున తుఫాన్ ప్రభావం తగ్గేవరకు వరి కోతలు కోయకుండా క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులకు తెలియచేయాలని తెలిపారు. రైతులు తొందర పడి వరి పంట కోసినట్లయితే ధాన్యం తడిసే అవకాశం ఉన్నందున తుఫాన్ ప్రభావం తగ్గేవరకు వరి పంట కోయకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ ప్రత్యేక టీములు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సంబంధిత డిఎస్పీల ఆధ్వర్యంలో టీములు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

కరాటే పోటీల్లో కుప్పం చిన్నారుల ప్రతిభ

ప్రజాశక్తి- కుప్పం: కర్ణాటక రాష్ట్రం కోలారులో జరిగిన 12వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ – 2025 పోటీల్లో కుప్పం చిన్నారులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. స్థానిక హాకింగ్స్ స్కూల్‌కు చెందిన 28 మంది విద్యార్థులు కరాటే మాస్టర్ రాజు, సౌమ్యల ఆధ్వర్యంలో ఈ పోటీల్లో పాల్గొనగా 8 మంది ప్రథమ స్థానం, 8 మంది ద్వితీయ స్థానం, 12 మంది తృతీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ హాఫీజ్ తెలిపారు. కరాటే పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను పాఠశాల తరఫున అభినందించారు. విద్యార్థులు ఇదే తరహాలో జాతీయ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

గురుకులంలో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి- కుప్పం

కుప్పం మండలం పరమసముద్రం కస్తూరిబా గురుకుల పాఠశాలలో ఆదివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో 6 నుండి పదవ తరగతి విద్యార్థులు పంచదార, నూనె, మైదా వినియోగించకుండా బలవర్ధకమైన పది రకాల ఆహార పదార్థాలు తయారుచేసి స్టాల్స్ పెట్టి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఒకేషనల్ ట్రైనీ సాయి కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తహశీల్దార్ ఆఫీసులో సిబ్బంది కొరత

- సకాలంలో అందని సర్టిఫికెట్లు
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు
- ప్రజలకు తప్పని నిరీక్షణ
- సిఎం ఇలాకాలో ఇదీ పరిస్థితి..

ప్రజాశక్తి- శాంతిపురం

సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండల తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది లేనిలోటు తీవ్రంగా వేధిస్తోంది. శాంతిపురం మండలంకు సంబంధించి తహశీల్దార్ 1, డిప్యూటీ తహశీల్దార్ 1, సీనియర్ అసిస్టెంట్-1, జూనియర్ అసిస్టెంట్-1, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు -2, 60 మంది వీఆర్వోలు ఉండాల్సి ఉంది.

మండలంలో 23 గ్రామ పంచాయతీలకు గాను 20 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటికి గాను 60 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. సాధారణంగా 60 రెవెన్యూ గ్రామాలకు 60 మంది విలేజ్ రెవెన్యూ అధికారులు ఉండాల్సి ఉంది. కానీ ఇక్కడ కేవలం ఎనిమిది మంది విలేజ్ రెవెన్యూ అధికారులతోనే పరిపాలన సాగిస్తున్నారు. అలాగే ఇద్దరు రెవెన్యూ ఇన్స్పెక్టర్లుకు గాని ఒక్కరు కూడా లేరు. సీనియర్ అసిస్టెంట్ అసలే లేడు.

శాంతిపురం మండలం భౌగోళికంగాను జనాభానా పరంగాను చాలా పెద్దది. దీంతో ఉన్న సిబ్బందితో పరిపాలన సాగించడానికి అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మీసేవ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు, ప్రజలు సకాలంలో సర్టిఫికెట్లు అందక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. ప్రజలు దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లు మీసేవ, గ్రామ సచివాలయల నుండి మొదటగా వీఆర్వో లాగిన్‌లోకి వస్తుంది. వీఆర్వో తన లాగిన్‌లో లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ఆర్ఐ లాగిన్ లోకి పంపించాల్సి ఉంది. ఆపై రెవెన్యూ ఇన్స్పెక్టర్ పరిశీలించిన తర్వాత తహశీల్దార్ లాగిన్‌కి పంపుతారు. అక్కడ తహశీల్దార్ బయోమెట్రిక్ ద్వారా సర్టిఫికెట్ను మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉన్న వీఆర్వోలు ఉద్యోగోన్నతిపై వచ్చినవారే. అందులోనూ వీరందరూ పదవీ విరమణకు దగ్గర్లో ఉన్న వాళ్లే. వీరికి ఆన్లైన్లో దరఖాస్తులను పరిశీలించి పంపించడం ఏ ఒక్కరికి పెద్దగా తెలీని పరిస్థితి. ఈ పనులన్నీ డిటి, తహశీల్దార్ స్వయంగా చేసుకోవాల్సి వస్తుంది దీంతో పనులన్నీ ఆలస్యమై రైతులు, ప్రజలు నిరీక్షించాల్సిన వస్తోంది.

ప్రజలకు తప్పని నిరీక్షణ...

ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలకు కావాల్సిన కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, గ్రామ కంఠంలో గల ఇళ్లస్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు, ఆన్లైన్లో భూముల వివరాలు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు ప్రజలు సకాలంలో తమ కావాల్సిన సర్టిఫికెట్లు ధ్రువీకరణ పత్రాలు పొందలేక ప్రతిరోజు ఆయా గ్రామ సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయం చుట్టూ రోజులు తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. మండలంలో ప్రజలు కష్టాలు పడుతున్న స్థానిక నాయకులు గానీ ఉన్నతాధికారులకు గాని పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు, స్థానిక నేతలు స్పందించి శాంతిపురం తహశీల్దార్ కార్యాలయంలో నెలకొన్న సిబ్బంది కొరతను తీర్చి ప్రజలు రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చాలని కోరుతున్నారు.

చిత్తూరును ఐటీ హాబ్‌గా మార్చుతా..

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చెన్నై, బెంగళూరు వంటి మెట్రో మహా నగరాల మధ్య ఉన్న చిత్తూరును ఐటీ హాబ్‌గా మార్చాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో.. చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజాదర్బార్ లో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొని విద్యార్థులు, యువతతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా చిత్తూరులో విద్యా అవకాశాలు, విద్యార్థుల లక్ష్యాలు, అందుబాటులో ఉన్న నైపుణ్యాలు, ఇంకా ఎలాంటి సౌకర్యాలు అవసరం, యువత ఆకాంక్ష తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. యువత, విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా చిత్తూరును అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి, సౌకర్యాల కల్పన కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. చెన్నై, బెంగళూరు వంటి మెట్రో మహా నగరాల మధ్య ఉన్న చిత్తూరులో ఐటి, పారిశ్రామికపరంగా కంపెనీలు వస్తాయన్నారు. చిత్తూరును ఐటీ హాబ్‌గా మార్చేందుకు.. సంప్రదింపులు జరుపుతున్నామని, విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. చిత్తూరులో క్రమం తప్పకుండా జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు.

96 మందికి ఉద్యోగ నియామకాలు..

ఆదివారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో వివిధ కంపెనీలకు ఎంపికైన 96 మందికి ఉద్యోగ నియామక పత్రాలను ఎమ్మెల్యే గురజాల అందించారు. జాబ్‌మేళాలో మొత్తం 167 మంది రిజిస్టర్ చేసుకోగా.. టాటా, విప్రో వంటి 11 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ నియామకాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఈకార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డిఎస్‌డిఓ గుణశేఖర్, డీపీవో చైతన్య, కార్పొరేటర్ శశి, టిడిపి నగర అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షులు వరలక్ష్మి, మహిళా విభాగం అధ్యక్షులు లీలావతి పాల్గొన్నారు.

వరి రైతులకు వర్షం గుబులు!

- కోతలకు సిద్ధంగా వరి
- మండలంలో 2వేల హెక్టార్లు వరి
- వణికిస్తున్న వర్షాల భయం
- నిరాశాజనకంగా ధరలు

ప్రజాశక్తి - పలమనేరు (గంగవరం): వరి రైతులకు వర్షం గుబులు మొదలైంది. ఈ ఏడాది మండలంలో అధికంగా రెండు వేల హెక్టార్లలో పండించిన వరి ప్రస్తుతం కోతదశలో వుంది. ప్రస్తుతం తుపాను కారణంగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడిచి ముద్దవుతుందోనని రైతులు గుండెల్లో భయం పుట్టుకుంది. అటు వర్షం అధికంగా పడితే పంట నేలపై పడిపోయి ధాన్యం రాలిపోయి నష్టం వస్తుందని , ఇటు పంటను కోసి నూర్పిడి చేస్తే ధాన్యం వర్షానికి తడిచి ముద్దవుతుందని రైతులు అయోమయంలో పడి ఆందోళన చెందుతున్నారు. చివరకు ఎలాగో నూర్పిడి చేసి ధాన్యాన్ని సేకరిస్తే అమ్ముకోవడానికి తగిన గిట్టుబాటు ధరకూడాలేదని, కనీసం పెట్టుబడి అయినా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోతకు సిద్ధంగా వున్న వరిపైరు

వరి రైతులకు వర్షం గుబులు!

మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఏకంగా రెండువేల హెక్టార్లలో వరి పండించినట్లు సమాచారం. ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువ పడటంతో చెరువుల నిండి పుష్కలంగా నీరు ఉండడంతో ప్రతి రైతు వరి పంటపై మక్కువ చూపించారు. ప్రస్తుతం వరి కోత దశకు చేరు కుంది. అయితే తుపాను వల్ల వర్షం ఎక్కువ పడితే పంట పూర్తిగా పడి పోయి ధాన్యం రాలి పో తుందని రైతులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు.

కోతలకు సిద్ధంగా వరి

చేతికి వచ్చిన పంట ఎక్కడ నేల, నీటిపాలు అవుతుందో అని అంటు న్నారు. గతంలో వరి పంటను మనుషుల ద్వారానే కోసి ధాన్యాన్ని ఒడ్డుకు చేర్చి చేసుకునేవారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో ఇప్పుడు మిషన్ల ద్వారా మడి కోత పనులు నిర్వహిస్తున్నారు. మిట్ట ప్రాంతంలో అయితే అనుకూలంగా ఉంటుందని చెరువు ఆయకట్టు కింద అయితే తేమ ఎక్కువగా ఉండటంతో మిషన్లు వెళ్లడానికి కష్టమవుతుందని కొంతమంది రైతులు ఎదురుచూస్తున్నారు.

నిరాశాజనకంగా ధరలు

ఇదిలా ఉండగా ప్రస్తుతం ధాన్యం ధర క్వింటాలు రెండువేల రూపాయలు లోపే ఉందని ధరలు ఇలాగే ఉంటే పెట్టుబడి కూడా చేతికి అందదని అంటున్నారు.

ఎకరాకు రూ.30వేలు ఖర్చు చేశాం..

ఈ సంవత్సరం చెరువులు నిండడంతో నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎకరాకు 30వేలు రూపాయలు ఖర్చు చేశాను. పంటలు బాగా పండాయని ప్రస్తుతం కోత దశకు వచ్చిన సమయంలో ఈ తుపానుతో వర్షం ఎక్కువై పొలంలో నీరు నిలిచిపోయి కోత మిషన్లు అక్కడికి వెళ్లేందుకు వీలు వుండదు.. దీంతో నష్టం వస్తుంది.. ప్రస్తుతం ఎకరాకు 30 నుండి 35 బస్తాలు రాబడి వస్తే తప్ప రైతులకు గిట్టుబాటు కాదు..ప్రస్తుతం వరి కోసేందుకు అనుకూలంగా ఉంది. కొన్ని రోజులు గడిస్తే ధాన్యం పూర్తిగా పొలంలోనే రాలిపోతాయి.. వరి గడ్డి కూడా పశువులకు పనికిరాదు..

- వెంకటరెడ్డి, రైతు.

నీరు నిలిస్తే వరి కోత కష్టం

రెండు ఎకరాల్లో వరి సాగు చేశారు. పొలం చెరువు కింద ఉండడంతో నెల రోజులుగా మడిని ఆరపెట్టినా తేమ తగ్గలేదు. ప్రస్తుతం మొదలైన తుపాను వల్ల మడిలో నీరు నిలిచిపోతే మిషన్లు వెళ్లేందుకు వీలు లేక ధాన్యం పొలంలో రాలిపోతాయి. గడ్డి పనికి రాకుండా పోతుంది. ఈ పరిస్థితులలో పెట్టుబడులు కూడా చేతికి రాదు. వరి పంట ఎక్కువగా ఉండడంతో ధాన్యం ధర కూడా తగ్గిపోయే అవకాశం వుంది. వారం లోపు మడి కొయ్యకపోతే పూర్తిగా నష్టపోతాం..

- శ్రీనివాసులు, రైతు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని పెద్దవెలగటూర్ పంచాయతీ ఓబుళాపురానికి చెందిన యు వెంకట రమణ కుమారుడు, యు వెంకటేష్ (33) ద్విచక్ర వాహనంలో పెద్ద పంజాణికి వస్తుండగా ముత్తుకూరు సమీపంలోని కోళ్ల ఫారాల వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేష్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనతో ఓబులాపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌పై కేంద్రం కక్ష సాధింపు

- సజ్జద్‌బాషా

ప్రజాశక్తి -పుంగనూరు: ప్రధానమంత్రి పదవిని త్యాగం చేసిన సోనియా గాంధీ, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై కేసులు నమోదు చేయడం పార్టీపై కక్ష సాధింపు చర్య అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జిల్లా ప్రియాంక సేవదళ్ అధ్యక్షుడు సజ్జద్ బాషా అన్నారు. ఈ సంఘటనను ఆదివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో తాజాగా నేడు కేంద్ర సంస్థలు ఇడి, సిబిఐ సోనియాగాంధీని, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ఖండించారు. బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్‌పై ప్రతీకార రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకత్వంపై బెదిరింపులు ప్రతీకార చర్యలతో వేధిస్తోందని దుయ్యపట్టారు. నేషనల్ హెరాల్డ్ కేసు పెద్ద బోగస్ అని అయినా భారత్ లక్షలాది కోట్లు దోచుకొని విదేశాల్లో ఉంటున్న బడా పారిశ్రామిక వ్యక్తులు వెంటనే తీసుకుని రావాలని డిమాండు చేశారు. వారిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని బిజెపి ప్రభుత్వం వారికి కొమ్ము కాస్తోందనడానికి ఇది ఒక నిదర్శనం అన్నారు.

పలమనేరులో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులో ఎస్‌విసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో భాగంగా ఆదివారం బాలురకు శ్రీకాకుళం, విజయనగరం జట్ల మధ్య నిర్వహించిన పోటీలో విజయనగరం గెలుపొందింది. ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి జిల్లాల మధ్య పోటీలో ఈస్ట్ గోదావరి జట్టు గెలుపొందింది. చిత్తూరు, ప్రకాశం జట్ల మధ్య పోటీలలో చిత్తూరు జట్టు విజయం సాధించింది. బాలికల విభాగానికి సంబంధించి చిత్తూరు, అనంతపూరు జట్ల మధ్య ఈస్ట్ గోదావరి, శ్రీకాకుళం జట్ల మధ్య, గుంటూరు, విజయనగరం జట్ల మధ్య, కడప, విశాఖపట్నం జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ కొనసాగుతోందని నిర్వాహకులు ప్రకటించారు. ప్రస్తుతానికి క్వార్టర్ ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తున్నారని, అనంతరం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు సోమవారం కొనసాగుతాయని తెలిపారు.

ఆరిమాని గంగమ్మకి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని వివి పురం గ్రామ పంచాయతీ గంగమ్మ గుడిలో వెలసిన ఆరిమాని గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట ఆలయ పూజారి వెంకటాచలపతి ఆచార్యులు అమ్మవారికి పాలాభిషేకం చేసి పూలతో అలంకరణ చేసి కుంకుమార్చన చేసి నైవేద్యం పెట్టారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు పొంగళ్లు సమర్పించారు. తల నీలాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీ ఎన్‌జీవోల సంఘం నాయకులు

ఏపీ ఎన్‌జీవోల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

- అధ్యక్షుడుగా కె ఆనందబాబు..వరుసగా ఐదవసారి ఎన్నిక
- కార్యదర్శిగా జయమ్మ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు తాలూకా ఏపీఎన్‌జీవోల సంఘం ఎన్నికలు ఆదివారం పలమనేరు ఎన్‌జీవో హోంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కె ఆనందబాబు, మండల ప్రజా పరిషత్ బైరెడిపల్లెలో పరిపాలనాధికారిగా పనిచేస్తూ వరుసగా ఐదవ సారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పిహెచ్‌సి పతికొండలో హెల్త్ సూపరువైజరు ఎం జయమ్మ ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా పంచాయతీ కార్యదర్శి బిఎస్ మోహనరాం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎన్ సురేష్, సెరికల్చర్ సీనియర్ అసిస్టెంట్ ఎన్ ప్రభాకర్, సబ్ ట్రెజరీ జూనియర్ అకౌంటెంట్ ఆర్ రాజ శేఖర్ ఎన్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షురాలిగా పిహెచ్‌సి కొలమాసనపల్లిలో ఏఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూఈ నాగేశ్వరమ్మ ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఇరిగేషన్ సబ్‌డివిజన్ లో ఎటీవో పి శ్రీనివాసులు ఎంపికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా పంచాయతీ అభివృద్ధి అధికారి ఎస్ హరి, వార్డ్ అడ్మిన్ సెక్రటరీ ఆర్ జలంధర్ నాయుడు, వి కోట ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి జ్ఞానేశ్వర్ ఎన్నికయ్యారు. మహిళా సంయుక్త కార్యదర్శిగా గంగవరం2లో ఏఎన్ఎం ఎన్ఎన్ వల్లెమ్మ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా వెల్ఫర్ సహాయకుకు పి. రమణ (కుర్మాయి-పలమనేరు), పీడీవో టి. సురేష్ బాబ (తీర్థం-బైరెడిపల్లి), సీనియర్ అసిస్టెంట్ కె. వినయ్ కుమార్ (ఎంపిపి- వికోట), పీడీవో వర్ధని రాజు (గంగవరం), పంచాయతీ సెక్రటరీ ఈ గణేశ్ (పెద్దచల్లారి గుంట పిఎస్-బైరెడిపల్లి), వెల్ఫేర్ అసిస్టెంట్ ఎచిన్నప్పయ్య (కల్లుపల్లి-గంగవరం మండలం), ఎంపిహెచెస్ జి. మధు (పిహెచ్‌సి-కొలమాసనపల్లి), టైపిస్ట్ పి పురుషోత్తం(పిఆర్ఐ-ఎస్‌డీ-పలమనేరు), విలేజ్ సర్వేయర్ పీ వెంకట్రమణ (బోయచిన్నాగనపల్లి-వికోట) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రత్యేక మహిళా మహిళా విభాగం ఏర్పాటు

మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా పిహెచ్‌సి-బైరెడిపల్లెలో ఎంపీ హెచ్‌ఏ గా పనిచేస్తున్న ఎన్ జయ ప్రభావతి ఎన్నికయ్యారు. కో చైర్‌పర్సన్‌గా ఎంపిపి పలమనేరు లో టైపిస్ట్ ఏసిఉషారాణి, వైస్ చైర్‌పర్సన్‌గా పశుపత్తూరు గంగవరం పరిధిలో ఏఎన్ఎం, ఏ. విజయలక్ష్మి, ఆర్ఎస్‌కే కలగటూరులోని ఏహెచ్‌ఏ కె దేవనాయకి కన్వీనర్‌గా గంగవరం3లో ఏఎన్ఎం, కె సుజాత ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లా సైనిక సంక్షేమ అధికారి, జిల్లా సంఘం అధ్యక్షులు కెవి రాఘవులు, జిల్లా కార్యదర్శి కె రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ స్వయంగా హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. పుంగనూరు ఏపీఎన్జీజీఓస్ అసోసియేషన్ అధ్యక్షుడు అలీఖాన్ ఎన్నికల అధికారి గా, సహాయ ఎన్నికల అధికారి సురేష్ బాబు వ్యవహరించారు.

ఉప సభాపతిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టరు రవిరాజు

ఉప సభాపతిని కలిసిన డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి -కార్వేటినగరం: పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప సభాపతి కనుమూరు రఘురామ కృష్ణంరాజును భీమవరంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ డిస్టిక్ గవర్నర్, మాజీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాజు, బిజెపి సీనియర్ నాయకులు నడింపల్లి యువరాజు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మెగా ఆరోగ్య వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రామకుప్పం: ప్రభుత్వం నిర్వహిస్తున్న సంజీవని హెల్త్ స్క్రీనింగ్ మెగా ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రామకుప్పం మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి కామరాజ్ నాయక్ కోరారు. సోమవారం రామకుప్పం సచివాలయం, వాసవి దేవాలయం వద్ద నిర్వహించే ఈ వైద్య ఆరోగ్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని తమ ఆరోగ్యాన్ని తనిఖీ చేసుకోవాలని, టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు, ప్రజలు పాల్గొనాలన్నారు. పరీక్షలు చేయించుకునే వారు ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సంఘమిత్రలు, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు తమ పరిధిలో ఉన్న ప్రజలందరినీ ఈ మెగా హెల్త్ క్యాంప్‌కు తీసుకొని రావాలని వారు కోరారు.

అరణియార్‌ను సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరులోని ఆరణియార్ ప్రాజెక్టును తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, పుత్తూరు డిఎస్పి రవికుమార్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. దిత్వా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆయన ప్రాజెక్టును సందర్శించి ప్రస్తుత పరిస్థితిని అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 29 అడుగుల నీరు ఉందని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాగులు వంకలు నదీ పరివాహక ప్రాంతానికి వెళ్ళవద్దని ఎస్పీ ఆదేశించారు. రెవెన్యూ పంచాయతీరాజ్ సచివాలయం విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఏదైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తహశీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. మండల స్థాయి అధికారులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఇరిగేషన్ అధికారులు ఎస్పీ వెంట పాల్గొన్నారు.

వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వివిధ కార్యక్రమాల్లో మాజీ డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలో ఆదివారం నిర్వహించిన పలు గృహప్రవేశ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కృపాలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని ముక్కలతూరు పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు రజిని, పెద్దకాలపవ పంచాయతీ సర్పంచ్ ఏకాంబరం కుమార్తె నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వెంకటరెడ్డి, సర్పంచ్ ముని రాజారెడ్డి, రాష్ట్ర మాజీ గ్రీన్ అండ్ బ్యూటిషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, మండల వైసిపి బీసీ సెల్ ఉపాధ్యక్షుడు చిట్టిబాబు మొదలి, వైసీపీ నాయకులు అంబోదరపల్లి బాబురెడ్డి, వేల్కూరు కుట్టి, పెద్దిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆబు, పుష్పరాజ్, వెంకటేష్ రెడ్డి, కేశవులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఓబనపల్లి కాలనీలోని వీరభద్ర స్వామి దేవస్థానం మొదటి వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని, స్వామిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయం తరఫున ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శివాలయం ధ్వజస్తంభం ప్రతిష్ట

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలం పాతపేట గ్రామంలోని శివాలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బి సుబ్రహ్మణ్యం శెట్టి హాజరై కార్యక్రమాన్ని సందర్శించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతపేట పంచాయతీ పరిధిలోని ఈ శివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం పూజా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, దేవస్థాన అభివృద్ధికి అందరూ కలిసి పని చేయాలని ఈ సందర్భంగా గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలక వర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- వికోట : మండల కేంద్రంలోని శ్రీ దుర్గామాత ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నూతన ధర్మకర్తగా రఘుపతి నాయుడు, ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డి, కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారి సన్నిధిలో తాజా మాజీ ధర్మకర్త ఎస్ఆర్ దామోదర్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రమాణ స్వీకారం చేశారు. అమ్మవారి ఆలయం నూతన ధర్మకర్తలి మండలిలో సభ్యులు కార్యవర్గం ప్రమాణ స్వీకారాన్ని ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర్ శర్మ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తగా రఘుపతి నాయుడు, ఉపాధ్యక్షులుగా కృష్ణారెడ్డి , నరసింహారెడ్డిలతో పాటు ప్రధాన కార్యదర్శిగా జగన్ మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రమేష్ బాబు, జనార్ధన్, బాలాజీ, కోశాధికారిగా తుకారాం, సలహా మండలి సభ్యులుగా ఏ.ఎం. రంగనాథ్, సి రామచంద్ర నాయుడు, కే యువరాజ్, జి శ్రీనివాసులు, ఆనంద రెడ్డి, సి శ్రీనివాసులు, బి విజయ్ కుమార్ రాజు, వెంకటరామప్ప, సి విశ్వేశ్వరయ్య, డివి భక్తవత్సలం, పి నాగభూషణం, పార్థసారథి, కమల్ రాజు తదితరులతో పాటు ఆలయ నూతన కార్యనిర్వాహక సభ్యులు అమ్మవారి ఎదుట ప్రమాణ స్వీకారం చేశారు. రానున్న కాలంలో ఆలయ అభివృద్ధి చేస్తామని నూతన పాలకవర్గం అహర్నిశలు కృషి చేస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.


కొలువు తీరిన నూతన పాలకవర్గ సభ్యులు

ఉత్తమ బోధనా సేవే లక్ష్యం..

ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మీ ప్రసాద్‌కు పలువురి ప్రశంస

ప్రజాశక్తి -యాదమరి: ఉత్తమ బోధనా సేవే లక్ష్యంగా ముందుకు సాగిన యాదమరి ఉన్నత పాఠశాల ఉపాధ్యా యుడు లక్ష్మీప్రసాద్ 42 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయిని ఇ హేమలత అధ్యక్షతన తెలుగు భాషా ఉపాధ్యాయులు లక్ష్మీ ప్రసాద్ ఉద్యోగ విరమణ సన్మానోత్సవ సభ నిర్వహించారు. సుమారు 42 సంవత్స రాలు విజయ వంతంగా పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొంది ఉత్తమ ఉపాధ్యాయుడుగా పేరు పొందిన లక్ష్మీ ప్రసాద్ విభిన్న శైలిలో విద్యార్థులకు తెలుగు పాఠాలను సందర్భోచిత పాటలతో మేళవించి అర్థమయ్యే రీతిలో బోధించడం విశేషం. పాఠశాలకు ఒక పెద్ద దిక్కుగా భీష్మా చార్యుల పాత్రను పోషిస్తూ అనేక కార్యక్రమాలను ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి తోడ్పడ్డారు. లక్ష్మీ ప్రసాద్, స్నేహశీలి, సౌమ్యులు, మిక్కిలి దాత అని, వివిధ సందర్భాలలో పాఠశాల పురోగతికి వేల రూపాయలు విరాళాలు ఇచ్చారని, ఆయన సేవలను పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ రుక్మిణి, ఎంఈఓ, ప్రసాద్ కొనియాడారు. పాఠశాల తరపున హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, లక్ష్మీ ప్రసాద్ ను దుశ్శాలువ, గోల్డ్ రింగ్, జ్ఞాపికతో ఘనంగా సత్క రించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ ప్రసాద్, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇతర పాఠశాల నుంచి విచ్చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

లక్ష్మీప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

ప్రజాశక్తి-తవణంపల్లి: తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తవణంపల్లి ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు. తుపాన్ నేపథ్యంలో తవణంపల్లి మండలంలో ప్రజలు పోలీస్ శాఖ నుండి ముఖ్యమైన విజ్ఞప్తి ఇప్పటికే వర్షాల కారణంగా అన్ని చెరువులు , కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని మండలంలోని అన్ని పంచాయతీలకు వెళ్లి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి రేపటి రోజు జిల్లాలో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. భారీ వర్షాలు కురిసేటప్పుడు అత్యవసరమైతేనే ప్రజలు ఇంటి నుండి బయటికి రావాలని సూచించారు. నదులు , వంకలు పరివాహక ప్రాంతాలు అన్ని లోతట్టు ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. తుపాన్ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ప్రజలకు సూచనలు ఇస్తున్న పోలీసులు

రోడ్డంతా గుంతలమయం!

- ప్రమాదాలతో సావాసం
- అడుగు తీసి అడుగు వేస్తే గోతులు
- రోడ్డుపై నీళ్లు..కనిపించని గుంతలు
- ప్రయాణించాలంటే సాహసమే..

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ప్రస్తుతం వానలు పడుతున్నాయి. అసలే గచ్చు తేలి గుంతల మయమైంది. ఎక్కడ గుంతలు ఉన్నాయో.. గోతులు ఉన్నాయో.. వర్షపు నీటిలో తెలియని దుస్థితి. తప్పనిసరి పరిస్థితుల్లో నిత్యావసర సరుకుల కోసం సమీపంలో ఉన్న వాణిజ్య సముదాయం పచ్చికాపల్లంకి వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే.. ద్విచక్ర వాహన దారులు, ఆటోవాళ్లు ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఏ గుంతలో అదుపుతప్పి ఆటో పక్కకు ఒరిగి పోతుందో తెలియదు. ద్విచక్ర వాహన దారులైతే.. ఆ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే గుండెలు అరచేతుల్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. నిత్యం గోతులతో ప్రమాదాలతో సావాసం చేయాల్సిందేనని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డంతా గుంతలమయం!

చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామం ఉంది. ఈ గ్రామానికి గతంలో సుమారు 20 సంవత్సరాలకు ముందు ప్రభుత్వం తారును ప్రభుత్వం మంజూరు చేసింది. గుత్తేదారు రోడ్డును వేశాడు. కొంతకాలం ప్రయాణం సజావుగా సాగింది. రాను రాను ఆ రోడ్డు కంకర తేలి.. గుంతలు ఏర్పడ్డాయి.

ప్రమాదాలతో సావాసం

వర్షం వస్తే గుంతల్లో నీళ్ల నిలిచి ప్రయాణం సాగించాలంటే అసౌకర్యంగా ఉండేది. గ్రామస్తులు ఈ రోడ్డుపైనే ప్రయాణం సాగించేవారు. ఈ రోడ్డు మీదుగా మాంబేడు, హరిజన వాడ, అరుంధతి వాడ, భారతీపురం, సింగపూర్ ఇండ్లు, ఒంటి ఇల్లు, కసవనూరు కసవనూరు, అరుంధతివాడ మీదుగా అటు కార్వేటినగరం పుత్తూరు రహదారి కలిసేది. ఇన్ని గ్రామాలకు ఈ రోడ్డు ఒకటే ఆధారం. ఇప్పుడు ఇలా రొచ్చురొచ్చుగా మారడంతో ప్రయాణం సాగించాలంటే ఇబ్బందికర పరిస్థితుల్లో ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడుగు తీసి అడుగు వేస్తే గోతులు

ఒక కుటుంబం నిత్యా అవసర సరుకుల కోసం సమీపంలో ఉన్న పచ్చికాపల్లంకు బయలుదేరింది. ముందు భార్య వర్షానికి తడవకుండా టవల్ నెత్తిన వేసుకుని వెళుతోంది. వెనుక వైపు భర్త గొడుగు వేసుకుని గుంతలు ఉన్నాయి.. చూసుకుని జాగ్రత్తగా వెళ్లు.. పడితే గాయాలపాలై ఆస్పత్రికి వెళ్లాల్సిందే..' అంటూ అప్రమత్తం చేస్తుండడం గమనార్హం.

రోడ్డుపై నీళ్లు..కనిపించని గుంతలు

మాంబేడు గ్రామం నుంచి కార్వేటినగరం- పుత్తూరు రహదారిలో కలిసే ఈ తారు రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడి రోడ్డంతా వర్షపు నీటితో నిండిపోవడంతో గుంతలు ఎక్కడ ఎటు వైపు వున్నాయో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. దీంతో అడుగుతీసి అడుగు వేయాలంటే గుండెలు గుప్పెట్లో దాచుకుని ముందుకు అడగు వేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రయాణించాలంటే సాహసమే..

పలు గ్రామాలను అనుసంధానం చేసుకుని వెళ్లే ఈ తారు రోడ్డుపై ప్రయాణించాలంటే నిత్యం సాహసం చేయాల్సి వస్తోంది. ఈ రోడ్డుపై గతంలో పలుమార్లు ద్విచక్ర వాహనంపై వెళ్లే వారు గోతుల్లో పడి గాయాల పాలైన సంఘటనలు అనేకం వున్నాయని స్థానికులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ తారు రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు.

నీటితో నిండి కనిపించని గుంతలు

గోతుల మయమైన రోడ్డు

రోడ్డు బాగు చేయండి..

మాంబేడు రోడ్డు నుంచి మా గ్రామానికి వచ్చే రోడ్డు బాగాలేదు. నడవడానికి ఇబ్బందిగా ఉంది. తారు రోడ్డులో ఎక్కడ చూసినా గుంతలు ఉన్నాయి. రాళ్లు తేలి పోయాయి. పాదాలకు గుచ్చుకుంటూ ఉంది. చెప్పులు లేకుండా నడవలేక పోతున్నాం.. బాగు చేయండి..రోడ్డు ఇట్లా ఉంటే..ఎలా నడిచి వెళ్లేది?

- నాగముని, మాంబేడు హరిజనవాడ.

ఇలా వుంటే ఎలా నడిచివెళ్లాలి?

ఈ వర్షానికి రోడ్డు ఎక్కడ చూసినా గుంతలుగా ఉంది. నడవాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నాం.. గుంతల్లో కాలుజారి ఎక్కడ పడిపోతామోనని భయంగా ఉంది. నాయకులు స్పందించి మా రోడ్డును బాగు చేయండి..

- చంగల్ పండు రెడ్డి, వెంకటరెడ్డి కండ్రిక, మాంబేడు పంచాయతీ.